క్లుప్తంగా

మట్టి రోడ్డు తొలగింపు


రోడ్డును తొలగిస్తున్న ఇరిగేషన్ అధికారులు

మద్దూరు(హుస్నాబాద్): మండలంలోని మర్మాముల శివారులోని సాయివెల్లి కుంట మధ్యలో నుంచి గతంలో వేసిన మట్టిరోడ్డును నీటిపారుదలశాఖ అధికారులు మంగళవారం తొలగించారు. ఈ సందర్భంగా నీటిపారుదల ఏఈ సతీశ్ మాట్లాడుతూ గత ఏడాది కొంత మంది కుంట మధ్యలో నుంచి అక్రమంగా మట్టిబాట వేశారని గ్రామస్తులు ఫిర్యాదు చేశారన్నారు. దీంతో రెవెన్యూ అధికారులు కుంట ఎఫ్‌టీఎల్‌ను నిర్ధారించారని, ఆ హద్దుల ప్రకారం మట్టిరోడ్డును తొలగించామని చెప్పారు. చెరువు, కుంటలను ఆక్రమిస్తే చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

దరఖాస్తుల పరిశీలన

దౌల్తాబాద్(దుబ్బాక): మండలంలో గత ప్రభుత్వ హయాంలో ఎల్‌ఆర్‌ఎస్‌కు వచ్చిన దరఖాస్తులను మండల గిర్దావార్ ఇరిగేషన్ ఏఈ దాసరి సుమన్ మంగళవారం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొత్తం 200 దరఖాస్తులు రాగా వాటిలో సుమారు 30 దరఖాస్తులు పరిష్కరించామని, త్వరలోనే మిగిలిన వాటిని కూడా పరిష్కరిస్తామన్నారు.

ధ్యానంతో ఒత్తిడి దూరం


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ శోభాదేవి

హుస్నాబాద్: విద్యార్థినులు మానసిక ఒత్తిడిని అధిగమించాలంటే ప్రతి ఒక్కరు ధ్యానం చేయాలని బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శోభాదేవి సూచించారు. కళాశాలలో మంగళవారం స్టడీ అవర్స్, మానసిక ఒత్తిడిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర విద్యార్థినులకు ఉదయం, సాయంత్రం వేళల్లో స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నామన్నారు. ఇంటర్మీడియెట్ బోర్డ్ ఆదేశాల మేరకు ఈఏపీ సెట్, ఐఐటీ, నీట్ కోచింగ్ కూడా నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో స్టూడెంట్ కౌన్సిలర్ నిర్మలాదేవి, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ అధికారి కరుణాకర్, అధ్యాపకులు రవీందర్, సదానందం, లక్ష్మయ్య, సంపత్, కవిత తదితరులు ఉన్నారు.

సస్యరక్షణ చర్యలు అవసరం


కంది పంటను పరిశీలిస్తున్న ఏఓ గీత

నంగునూరు(సిద్దిపేట): పూత, పిందె దశలో ఉన్న కంది పంటకు సస్యరక్షణ చర్యలు తీసుకొని మందులు పిచికారీ చేయాలని వ్యవసాయ అధికారి గీత రైతులకు సూచించారు. నంగునూరులో మంగళవారం కంది పంటను పరిశీలించి మరుక మచ్చల పురుగు ఆశించినట్లు గుర్తించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లద్దె పురుగు ఆశించిన పంటకు క్లోరీ ఫైరీపాస్, డైక్లోరోవాస్ లేదా క్లోరంత్ర నిలిప్రోలు ద్రావకాన్ని నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. అలాగే శనగపచ్చ, పేనుబంక పురుగు, కాయతొలిచే ఈగ ఆశిస్తోందని రైతులు జాగ్రత్తలు తీసుకుని పంటను కాపాడుకోవాలని సూచించారు.

ఉద్యోగుల సమస్యలపై పోరాడుతాం: టీఎన్‌జీఓ


సభ్యత్వ నమోదులో నాయకులు

దుబ్బాకటౌన్: ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం పోరాడుతామని టీఎన్‌జీఓ జిల్లా ఉపాధ్యక్షుడు మురళి అన్నారు. మంగళవారం దుబ్బాకలో ఉద్యోగుల సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. మండల ప్రజాపరిషత్ కార్యాలయం, తహసీల్దార్, మున్సిపల్ కార్యాలయాల్లో సభ్యత్వాలు నమోదు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సభ్యలందరికీ అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో తాలుకా మాజీ అధ్యక్షుడు రఘురామ కృష్ణ, కార్యదర్శి వెంకటేశం, జిల్లా జాయింట్ కార్యదర్శి రాజు పాల్గొన్నారు.

ధాన్యానికి గిట్టుబాటు ధర

హుస్నాబాద్‌రూరల్: రైతులు తమ ధాన్యాన్ని ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించి కొనుగోలు చేస్తోందని సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య అన్నారు. మంగళవారం మీర్జాపూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. తిరుపతి, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.


బాబోయ్.. కుక్కలు

- గుంపులు గుంపులుగా స్వైరవిహారం
- స్థానికులపై తరచూ దాడులు
- చర్యలు తీసుకోవాలంటున్న స్థానికులు

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని పలు గ్రామాల్లో కుక్కలు స్వైరవిహారం చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. వృద్ధులు, చిన్నారులు, మహిళలపై దాడులు చేసి గాయపరుస్తున్నాయి. మండలంలో మొత్తం 32గ్రామాలు ఉండగా.. ఒక్కొక్క గ్రామంలోను పదుల సంఖ్యలో కుక్కలు సంచరిస్తున్నాయి. పెద్దలు, చిన్నారులపై దాడులకు దిగుతున్నాయి. దీంతో వీధుల్లో తిరగాలంటేనే ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. కుక్కల దాడులు ఎక్కువ కావడంతో ఇటీవల హైకోర్టు తీవ్రంగా పరిగణించింది. నియంత్రణకు చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేసింది. అయితే కుక్కలను చంపొద్దనే చట్టం ఉండడంతో ఏమీ చేయలేని పరిస్థితి నెలకొంది. ప్రజలు మాత్రం కుక్కలను అరికట్టాలని కోరుతున్నారు.

ఎక్కడ చూసినా కుక్కలే

మండలంలో ఏ గ్రామానికి వెళ్లినా.. ఏ మూల చూసినా కుక్కలు అధిక సంఖ్యలో దర్శనమిస్తున్నాయి. మండల వ్యాప్తంగా దాదాపుగా 1,250 వరకు కుక్కలుంటాయని అంచనా. పాఠశాలకు వెళ్లిన విద్యార్థులు సాయంత్రం వేళ ఇంటికి వస్తుంటే కుక్కలు దాడులు చేస్తున్నాయి. ఇటీవల మైసమ్మ వాగుతండాలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఆడుకుంటున్న ఓ బాలుడిపై కుక్కలు దాడిచేసి తీవ్రంగా గాయపరిచాయి. వెంటనే ఆస్పత్రికి తీసుకువెళ్లి చికిత్స చేయించారు. దీంతో మరుసటి రోజు బాలుడి తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.


చౌటపల్లిలో తిరుగుతున్న కుక్కలు

ఫిర్యాదు చేస్తే పట్టుకుంటాం..



కుక్కల బెడద తీవ్రంగా ఉంటే పంచాయతీ సిబ్బందికి ఫిర్యాదు చేయండి. ప్రత్యేక కార్మికులు వాటిని పట్టుకుని దూరంగా వదిలేస్తారు. పంచాయతీలో పరిధిలోని కార్మికులు పారిశుద్ధ్య సమస్యలపై దృష్టి సారిస్తున్నారు. కుక్కలతో ప్రజలకు ఇబ్బంది కాకుండా చూడాలని వారిని కూడా ఆదేశించాం.

- భానోతు జయరాం, ఎంపీడీఓ, అక్కన్నపేట మండలం

క్రీడా పోటీలకు విద్యార్థుల ఎంపిక

సిద్దిపేటఎడ్యుకేషన్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-19 విభాగంలో జిల్లా, రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల విద్యార్థులను ప్రిన్సిపాల్ సత్యనారాయణరెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా మంగళవారం క్రీడాకారులు పోటీల్లో పాల్గొనేందుకు అవసరమైన ధ్రువపత్రాలను అందించారు. అనంతరం మాట్లాడుతూ క్రీడల వల్ల ఉన్నత విద్య, ఉద్యోగావకాశాల్లో రిజర్వేషన్ లభిస్తుందన్నారు. ఎంపీసీ ద్వితీయ సంవత్సరం విద్యార్థి అనిరుధ్‌రెడ్డి బాస్కెట్ బాల్లో రాష్ట్రస్థాయి పోటీలకు, ఎంఎల్‌టీ ఫస్టియర్ విద్యార్థి క్రికెట్‌లో జిల్లా స్థాయికి, ఎంపీసీ సెకండియర్ విద్యార్థులు సమద్, శివగణేశ్, ఎంఎల్‌టీ విద్యార్థులు కార్తీక్, స్వామిచరణ్ జిల్లా స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. వారిని ప్రిన్సిపాల్‌తో పాటు అధ్యాపకులు సుధాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, అశోక్, నగేశ్, రఘురాజ్ అభినందించారు.

జిల్లా స్థాయి పోటీల్లో తృతీయ స్థానం

జగదేవ్‌పూర్(గజ్వేల్): ఎస్‌జీఎఫ్ జిల్లాస్థాయి అండర్-17 బాలికల విభాగంలో ఆదర్శ పాఠశాల క్రీడాకారులు వాలీబాల్‌లో తృతీయస్థానం సాధించినట్టు కళాశాల ప్రిన్సిపాల్ స్లీవరాజ్ తెలిపారు. ఈ సందర్భంగా వారిని పాఠశాలలో మంగళవారం సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. పీఈటీ అనంతరాములు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.


సిద్దిపేటఎడ్యుకేషన్: ధ్రువపత్రం అందజేస్తున్న ప్రిన్సిపాల్ సత్యనారాయణరెడ్డి

ఆలస్యంగా వచ్చిన కార్యదర్శులపై చర్యలు

ఎంపీడీఓ ఆగ్రహం

నంగునూరు(సిద్దిపేట): జిల్లా పంచాయతీ అధికారి సకాలంలో సమావేశానికి వచ్చినా ''మీరు రారా.. మీపై చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తా..'' అంటూ పంచాయతీ కార్యదర్శులపై ఎంపీడీఓ లక్ష్మణప్ప ఆగ్రహం వ్యక్తం చేశారు. డీపీఓ, మండల ప్రత్యేక అధికారి దేవకీదేవి అధ్యక్షతన నంగునూరు మండల ప్రత్యేక సమావేశం మంగళవారం నిర్వహించారు. సమావేశం ప్రారంభమైనా గ్రామ ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు హాజరుకాకపోవడంతో ఎంపీడీఓ తమ సిబ్బందితో వారికి ఫోన్ చేయించారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాల్సిన వారే ఆలస్యంగా వస్తే ఎలా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయా శాఖల అధికారులు పథకాల గురించి వివరించారు. ఏఓ గీత మాట్లాడుతూ వివిధ కారణాలతో 826 మంది రైతులకు రుణమాఫీ కాలేదని ఆ జాబితాను ఉన్నతాధికారులకు అందజేశామన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో టాయిలెట్ నిర్మాణాలకు రూ.35వేలు మంజూరైనా పనులు ఎందుకు చేయించడంలేదని ప్రత్యేక అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామాల్లో వడ్ల కొనుగోలు కేంద్రాలను రెండు రోజుల్లో ప్రారంభించాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సరిత, ఎంఈఓ దేశిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ రమేశ్‌గౌడ్ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డీపీఓ దేవకీదేవి

అపరిచితులపై అప్రమత్తం: ఏసీపీ మధు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): అపరిచితులతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏసీపీ మధు సూచించారు. కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్‌లో భాగంగా మంగళవారం రంగధాంపల్లిలో నార్కొటిక్స్ డాగ్స్ సహాయంతో తనిఖీలు నిర్వహించారు. 28 బైక్‌లు, 18 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఆయన మాట్లాడుతూ కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్‌తో ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకొనే అవకాశం ఉంటుందన్నారు. సీఐలు విద్యాసాగర్, ఉపేందర్, దుర్గ, మహిళా స్టేషన్ ఎస్ఐ అపూర్వరెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.


మద్యం బాటిళ్లను చూపుతున్న ఏసీపీ మధు

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి: ఏసీపీ సతీష్

హుస్నాబాద్: నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు దోహదపడతాయని ఏసీపీ సతీశ్ అన్నారు. బుడగ జంగాల కాలనీలో 17బైకులను స్వాధీనం చేసుకున్నారు. సీఐ శ్రీనివాస్, ఎస్ఐలు పాల్గొన్నారు.

వరి పొలాలను పరిశీలించిన వ్యవసాయాధికారి

సిద్దిపేటఅర్బన్: వర్షాల కారణంగా నేలకొరిగిన వరి పంటను నాలుగైదు కుదురులను ఒక దగ్గర కట్టగా కట్టి నిలబెట్టుకోవడం ద్వారా నష్టాన్ని తగ్గించుకోవచ్చని సిద్దిపేట అర్బన్ మండల వ్యవసాయాధికారి బి.శ్రీనాథ్ రైతులకు సూచించారు. మండలంలోని నాంచారుపల్లి, బక్రిచెప్యాల గ్రామాలలో వరి పొలాలను ఏఈఓలతో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలకు సన్నరకాల వరి పొలాలు నేలకొరిగాయని, వాటిని అలాగే వదిలేస్తే గింజ రంగు మారి తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. వాతావరణ పరిస్థితుల వల్ల సన్నరకం వరిలో మానిపండు తెగులు లక్షణాలు కనిపిస్తున్నాయని, నివారణ కోసం లీటర్ నీటిలో ప్రోపికోనజోల్ 1ఎంఎల్ ద్రావణాన్ని కలిపి పిచికారీ చేసుకోవాలని సూచించారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): హౌజింగ్‌బోర్డు కాలనీలోని 11కేవీ ఫీడర్ మరమ్మతుల కారణంగా బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సిద్దిపేట అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ సుధాకర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హౌజింగ్ బోర్డు కాలనీ, ఎంఎల్ఏ క్యాంప్ కార్యాలయం, ప్రియదర్శినినగర్, హరిప్రియనగర్, టీచర్స్‌కాలనీ ప్రాంతాలలో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని తెలిపారు.

అసిస్టెంట్ కుక్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

దుబ్బాకటౌన్: రాయపోల్ మండల కేంద్రంలో కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ కుక్ పోస్ట్‌కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఎంఈఓ సత్యనారాయణరెడ్డి తెలిపారు. 300 మందికి పైగా వంట చేయగల సామర్థ్యం కలిగి ఉండి, ఏడో తరగతి చదివిన వారు అర్హులని చెప్పారు. దరఖాస్తులను ఈనెల 23 నుంచి 29లోగా పాఠశాలలో అందజేయాలని కోరారు.

ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్య పరామర్శ


మాట్లాడుతున్న వెంకటయ్య

మిరుదొడ్డి(దుబ్బాక): అక్బర్‌పేట-భూంపల్లి మండల కేంద్రంలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన పర్స నారాయణ కుటుంబాన్ని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య పరామర్శించి రూ.5వేలు అందజేశారు. ఆయన వెంట దుబ్బాక పీఏసీఎస్ చైర్మన్ శేర్ల కైలాస్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జీడిపల్లి రవి, భూంపల్లి గ్రామ కమిటీ అధ్యక్షుడు ఐతం శ్రీనివాస్, సుక్క రాజు తదితరులు ఉన్నారు.

వ్యవసాయ కమిషన్ సభ్యురాలికి సన్మానం

చిన్నకోడూరు(సిద్దిపేట): రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషన్ సభ్యురాలిగా నూతనంగా నియమితులైన మరికంటి భవానిరెడ్డిని మంగళవారం యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లె రాజు హైదరాబాద్‌లో సన్మానించారు. రైతు సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని ఆమె తెలిపారు.

తడిసిన ధాన్యాన్ని కొనాలి

సిద్దిపేటజోన్: అకాల వర్షానికి తడిసిన పంటలను కొనుగోలు చేయాలని మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్‌లు సాయిరాం, సారయ్య, సోమిరెడ్డి, రవీందర్ రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వారు మాట్లాడారు. జిల్లాలో 417 కొనుగోలు కేంద్రాలకు గాను ఇప్పటి వరకు 80 కేంద్రాలు మాత్రమే ప్రారంభించారని విమర్శించారు.

ప్రతి ఒక్కరు చట్టాన్ని గౌరవించాలి

ఏసీపీ సతీశ్

హుస్నాబాద్/మర్కూక్(గజ్వేల్)/తొగుట(దుబ్బాక)/గజ్వేల్‌రూరల్/దౌల్తాబాద్ (దౌల్తాబాద్): పోలీసు అమరవీరుల త్యాగాలను ప్రతి ఒక్కరు గుర్తుంచుకుని, చట్టాన్ని గౌరవించాలని ఏసీపీ సతీశ్ సూచించారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆయన ఆధ్వర్యంలో సీఐ శ్రీనివాస్, ఎస్ఐ మహేశ్, సిబ్బంది కలిసి మంగళవారం పోలీస్ స్టేషన్ ఆవరణలో విద్యార్థులకు ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. పోలీసుల విధులు, స్టేషన్ హౌస్ అధికారి, రైటర్ గదులు, లాకప్‌లు, ఆయుధాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ రోడ్డు నిబంధనలు, ట్రాఫిక్ నిబంధనలు పాటించి ప్రమాదాలను అరికట్టాలన్నారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు బానిసలు కావద్దని, క్రమశిక్షణతో విద్యను అభ్యసించి లక్ష్యాన్ని సాధించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఆర్ సిబ్బంది పాల్గొన్నారు. గజ్వేల్ పోలీస్ స్టేషన్ ఆవరణలో రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పోలీసులు ప్రజల ధన, మాన ప్రాణ రక్షణ కోసం ఎల్లవేళలా విధులు నిర్వహిస్తున్నారన్నారు. ఎస్ఐలు దామోదర్, చంద్రమోహన్, కరుణాకర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు. తొగుట పోలీస్ స్టేషన్‌లో కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఎస్ఐ రవికాంత్‌రావు ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. గజ్వేల్ పోలీస్‌స్టేషన్‌లో ఏసీపీ పురుషోత్తంరెడ్డి సెయింట్ మేరీస్, మహతి, కృష్ణవేణి పాఠశాలల విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీఐ సైదా, ట్రాఫిక్ సీఐ మురళి, గజ్వేల్ అదనపు సీఐ ముత్యంరాజు పాల్గొన్నారు. అలాగే దౌల్తాబాద్ మండల పరిధిలోని పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ శ్రీరామ్ ప్రేమ్‌దీప్ పోలీసు అమరవీరుల దినోత్సవం నిర్వహించారు.


హుస్నాబాద్: విద్యార్థులకు ఆయుధాల గురించి వివరిస్తున్న ఏసీపీ సతీశ్


చేర్యాల(సిద్దిపేట): వాకీటాకీపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ నీరేశ్

పోలీసుల త్యాగాలు చిరస్మరణీయం

దుబ్బాకటౌన్/కోహెడ(హుస్నాబాద్)/చేర్యాల(సిద్దిపేట)/నంగునూరు(సిద్దిపేట): ప్రజలను కాపాడేందుకు అమరులైన పోలీసుల త్యాగాలు చిరస్మణీయం అని ఎస్ఐ గంగరాజు కొనియాడారు. స్థానిక స్టేషన్‌లో దుబ్బాక, మిరుదొడ్డి, అక్బర్ పేట భూంపల్లి పాఠశాల, కళాశాల విద్యార్థులకు ఓపెన్ హౌజ్ కార్యక్రమం నిర్వహించారు. సుమారు 500 మంది విద్యార్థులు పాల్గొన్నారు. పలు ఆయుధాలను ఏ సమయంలో ఎలా వాడతారో వివరించారు. కార్యక్రమంలో ఎస్ఐలు హరీశ్, పరశురాములు, సిబ్బంది భిక్షపతి, రాంజీ, జీవన్, విద్యార్థులు పాల్గొన్నారు. కోహెడ పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మోడల్ స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు. ఎస్ఐ అభిలాష్ విద్యార్థులకు సాంకేతిక పరికరాల గురించి వివరించారు. ప్రతి విద్యార్థి సమాజంపై గౌరవంగా ఉండాలని సూచించారు. చేర్యాల పోలీస్ స్టేషన్ ఆవరణలో నిర్వహించిన ఓపెన్ హౌస్ కార్యక్రమంలో ఎస్ఐ పి.నీరేశ్, మద్దూర్ ఎస్ఐ షేక్ మహబూబ్ తమ సిబ్బందితో కలసి పాల్గొన్నారు. పలు పాఠశాలల విద్యార్థులకు నూతన చట్టాలు, సాంకేతికత గురించి అవగాహన కల్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ సైబర్ నేరగాళ్ల వలలో పడకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. నంగునూరు రాజగోపాల్‌పేట పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ ఆసిఫ్ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు.

ప్రతీ గింజ కొనుగోలు చేస్తాం..

మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి

చేర్యాల(సిద్దిపేట)/చిన్నకోడూరు(సిద్దిపేట)/సిద్దిపేటరూరల్/మద్దూరు(హుస్నాబాద్): రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని డీసీసీ అధ్యక్షుడు, జనగామ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కొమ్మూరి ప్రతాప్ రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డుతో పాటు మండల పరిధిలోని రాంపూర్, కాశగుడిసెలు, ఆకునూరులో ధాన్యం కొనుగోలు కేంద్రాలను మార్కెట్ చైర్మన్ ఎస్.శ్వేత, పీఏసీఎస్ చైర్మన్ మేర్గు కృష్ణాగౌడ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కొమ్మూరి మాట్లాడారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. మున్సిపల్ చైర్ పర్సన్ స్వరూపరాణి, కౌన్సిలర్లు లింగం, నరేందర్, రవి, ఆగంరెడ్డి, శంకరాచారి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు. చిన్నకోడూరు మండలంలోని మల్లారం, సికింద్లాపూర్, అనంతసాగర్ గ్రామాల్లో గంగాపూర్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను పీఏసీఎస్ చైర్మన్ ములకల కనకరాజు ప్రారంభించారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని రైతులకు సూచించారు. మధుసూదర్ రెడ్డి, లింగం, పరశురాములు, బాపయ్య, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు. వర్షాల కారణంగా తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేస్తామని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ చెప్పారు. సిద్దిపేటరూరల్ మండలం చిన్నగుండవెల్లి, ఇర్కోడ్, బుస్సాపూర్, తోర్నాల గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఎంపీడీఓ మురళీధర్‌శర్మ, ఏపీఎం విజయనిర్మల, రాములు, అంజిరెడ్డి, గోపీకృష్ణ, లక్ష్మి, సదాశివారెడ్డి, మహిపాల్‌రెడ్డి, ఏఈ సౌమ్య, ఏఈఓ వెన్నెల పాల్గొన్నారు. మద్దూరు మండలంలోని రేబర్తి, గాగ్గిళ్లాపూర్ గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను చేర్యాల మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కామిడి జీవన్‌రెడ్డి ప్రారంభించారు. రాజిరెడ్డి, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.


చేర్యాల(సిద్దిపేట): కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న శ్వేత తదితరులు

కేంద్రాలు ప్రారంభించినా ఒక్క గింజా కొనలేదు

హుస్నాబాద్: ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన అధికారులు ఒక్క గింజ కూడా కొనలేదని, వెంటనే ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులకు గిట్టుబాటు ధర అందించాలని మున్సిపల్ చైర్ పర్సన్ రజిత డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ నాయకులతో కలిసి మంగళవారం ఆమె వ్యవసాయ మార్కెట్‌లో ధాన్యం కొనుగోళ్లను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ కొనుగోళ్లు జరగకపోవడంతో విసుగు చెందిన రైతులు దళారులకు అమ్ముకుంటున్నారన్నారు. వాతావరణాన్ని దృష్టిలో పెట్టుకొని వెంటనే కొనుగోళ్లు ప్రారంభించాలని కోరారు. ఆమె వెంట మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ అనిత, బీఆర్ఎస్ నేతలు అన్వర్ పాష, మల్లికార్జున్ రెడ్డి, శంకర్ రెడ్డి, పరశురాములు, శ్రీనివాస్, జీవన్ ఉన్నారు.

రాష్ట్రస్థాయి సైక్లింగ్‌లో రాణించిన సోదరులు

హుస్నాబాద్: హైదరాబాద్‌లో 18, 19వ తేదీలల్లో నిర్వహించిన రాష్ట్రస్థాయి సైక్లింగ్ పోటీల్లో హుస్నాబాద్‌కు చెందిన సూరంపల్లి సోదరులు సుమిత్, అమిత్ విజేతలుగా నిలిచినట్లు జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జంగపల్లి వెంకటనర్సయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అమిత్ 5 కి.మీ విభాగంలో మొదటి స్థానం, అండర్-16లో సుజిత్ రజిత పతకం సాధించారు. మల్లారెడ్డి, చంద్రారెడ్డి, విజయకాంతారావు, విజయభాస్కర్‌రెడ్డి, శ్రీనివాస్, సంజీవ్, మనోహర్ రెడ్డి మంగళవారం వారిని అభినందించారు.

సంక్షిప్త వార్తలు

◆ **సెల్‌ఫోన్ అప్పగింత**

కొండపాక(గజ్వేల్): పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను బాధితుడికి అప్పగించినట్లు కుకునూరుపల్లి ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. తిమ్మారెడ్డిపల్లికి చెందిన కోల రాజు గతనెల 21న తన ఫోన్ పోయిందని ఫిర్యాదు చేశాడు. దీంతో సీఈఐఆర్ పోర్టల్ ఆధారంగా పోలీసులు ఆ సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం ఆ ఫోన్‌ను బాధితుడికి అప్పగించామని ఎస్ఐ తెలిపారు.

◆ **అనారోగ్యంతో ఇద్దరు మృతి**

కొండపాక(గజ్వేల్): మండలంలోని సిర్సనగండ్లలో మంగళవారం ఇద్దరు చనిపోయారు. గ్రామానికి చెందిన చెంది మల్లయ్య(80), ముత్యాల రాజయ్య(75) అనారోగ్యంతో మృతి చెందారు. రాజయ్య వార్డు సభ్యుడుగా సేవలందించారు.

◆ **కరపత్రాల ఆవిష్కరణ**

కోహెడ(హుస్నాబాద్): జాతీయ మాల మహానాడు ఆధ్వర్యంలో 25నుంచి డిసెంబరు 1వరకు నిర్వహించనున్న మాలల మహా పాదయాత్రకు చెందిన కరపత్రాలను జిల్లా ఉపాధ్యక్షుడు తలారి నర్సయ్య మంగళవారం ఆవిష్కరించారు. అవినాష్, కిషోర్, శ్రీనివాస్, రాందాస్, చంద్రయ్య, రామస్వామి, రమేశ్, రాజు, శ్రీనివాస్, తిరుపతి, మొండయ్య, స్వామి, బాలయ్య, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

◆ **అందరి కృషితోనే ఆర్టీసీ అభివృద్ధి**

గజ్వేల్‌రూరల్: ఆర్టీసీ అభివృద్ధిలో ఉద్యోగులు, సిబ్బంది గజ్వేల్-ప్రజ్ఞాపూర్ డిపోను ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని డిపో మేనేజర్ పవన్ కోరారు. రాఖీ పౌర్ణమి, దసరా సందర్భంగా అత్యధిక ఆదాయాన్ని సమకూర్చడంలో భాగస్వాములైన ఉద్యోగులకు మంగళవారం స్టీల్ వాటర్ బాటిళ్లను అందజేసి అభినందించారు. కార్యక్రమంలో బాబునాయక్ తదితరులు పాల్గొన్నారు.

◆ **పుస్తక పఠనంపై అవగాహన**

మిరుదొడ్డి(దుబ్బాక): విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మక శక్తిని వెలికితీయాలని సెక్టోరియల్ అధికారి భాస్కర్ కోరారు. ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం రూం టూ రీడ్ కార్యక్రమం నిర్వహించారు. పేరెంట్ క్యాలెండర్లను ఆవిష్కరించి, పుస్తక పఠనంపై అవగాహన కలిగించారు. మధు, శ్రీనివాస్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

◆ **క్యాన్సర్‌పై చైతన్యం అవసరం**

సిద్దిపేటజోన్: ప్రతి ఒక్కరు క్యాన్సర్‌పై చైతన్యం కలిగిఉండాలని డాక్టర్ భాస్కర్ పిలుపునిచ్చారు. మంగళవారం ప్రతిభ డిగ్రీ, పీజీ కళాశాలలో క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన సదస్సులో ఆయన పాల్గొన్నారు. లయన్స్ క్లబ్ కో-ఆర్డినేటర్ జోజి, ప్రిన్సిపాల్ సూర్యప్రకాశ్‌రావు, లోహిత్ సాయి హాస్పిటల్ ప్రతినిధులు చంద్రశేఖర్, రమేశ్ పాల్గొన్నారు.

◆ **విద్యారంగ అభివృద్ధికి పెద్దపీట**

గజ్వేల్‌రూరల్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యారంగ అభివృద్ధికి పెద్దపీటవేసి ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసిందని మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ సర్దార్‌ఖాన్ అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్వీర్యం చేసిందన్నారు. కార్యక్రమంలో నర్సింహారెడ్డి, రాములు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

◆ **చెలుకలపల్లి గ్రామస్తుల నిరసన**

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని చెలుకలపల్లిలో నెలకొన్న సమస్యలు పరిష్కరించడంలో అధికారులు, నాయకులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపిస్తూ మంగళవారం పంచాయతీ ఎదుట గ్రామస్తులు నిరసనకు దిగారు. వారు మాట్లాడుతూ గ్రామంలో సరైన రోడ్డు లేదని, అలాగే తాగునీరు సక్రమంగా సరఫరా కావడం లేదని వాపోయారు. ఉన్నతాధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. బీజేపీ నేత సాయికిరణ్ వారికి మద్దతు తెలిపారు.

◆ **సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత**

చేర్యాల(సిద్దిపేట): మండలంలోని ముస్త్యాల, వీరన్నపేట గ్రామాలకు చెందిన ఎలికట్టె అనురాధ, స్వప్నకు సీఎం సహాయనిధి నుంచి మంజూరైన చెక్కులను కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు నాగపురి కిరణ్‌కుమార్ మంగళవారం వారికి అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేదలకు సీఎం సహాయనిధి అండగా నిలుస్తోందన్నారు. కార్యక్రమంలో శ్రీనివాస్, చందు, రవీందర్, అంజయ్య, కిరణ్, కిషన్, రమేశ్, ప్రవీణ్, భూమయ్య తదితరులు పాల్గొన్నారు.

◆ **నూతన కమిటీ ఎంపిక**

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): తెలంగాణ వాటర్ క్వాలిటీ మానిటరింగ్ ల్యాబోరెటరీస్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఉమ్మడి మెదక్ జిల్లా నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎంపికచేశారు. రాష్ట్ర అధ్యక్షుడు ఉదయరావు, ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి ఆధ్వర్యంలో కమిటీని ఎంపిక చేశారు. అధ్యక్షుడుగా శివరమేశ్, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా నాగేందర్, ఉపాధ్యక్షులుగా దీప, జైపాల్, చిరంజీవి, కార్యదర్శిగా శ్రీనివాస్‌చారి, పద్మ తదితరులు ఎంపికయ్యారు.